క్లుప్తంగా

నరసింహస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: మండలంలోని ఏడూరు వద్ద వెలసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నటరాజస్వామి ఆధ్వర్యంలో అభిషేక, హోమ పూజలు నిర్వహించి, స్వామివార్లను అలంకరించారు.

వైభవంగా నంది వాహన సేవ



చౌడేపల్లె: మండలకేంద్రంలోని ప్రసిద్ధ శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం నందివాహనంపై శివపార్వతులు పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

పంట పొలాలపై ఏనుగుల దాడి



జోగివారిపల్లెలో ధ్వంసమైన మామిడి చెట్లు

సదుం: మండలంలోని జోగివారిపల్లె, బత్తలవారిపల్లె పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. రైతులు నరసింహారెడ్డి, కాలే రెడ్డెప్ప రెడ్డి, జ్యోతి, సురేష్ రెడ్డి, రఘుకు చెందిన పంట పొలాలు ధ్వంసమయ్యాయి. మామిడి, వరి, టమాటా తదితర పంటలకు నష్టం చేకూరింది. బాధిత రైతులు మాట్లాడుతూ ఐరాల మండలం ఎల్లంపల్లి వైపు నుంచి ఏనుగుల గుంపు వచ్చిందని, ఫెన్సింగ్‌ను కూడా ధ్వంసం చేశాయని తెలిపారు.

బహుమతుల ప్రదానం



పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లెలో వేసవి సెలవుల సందర్భంగా ఎస్‌పీఎం చర్చి ఫాదర్ శ్యామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, ఆటల పోటీల విజతలకు బహుమతులు అందజేశారు. శనివారం విజేతలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం: మండలంలోని పచ్చార్లమాకులపల్లె సమీపంలో శనివారం కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా అదే గ్రామానికి చెందిన అంజిరాజు,ప్రభును పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 192 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞానసుధలో జాబ్‌మేళా రేపు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో సీఎంటీ రోడ్డులో ఉన్న విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించను న్నట్లు ఆ కళాశాల చైర్మన్ శ్రీధర్ వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యా ప్తంగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపికయ్యే వారికి సంవత్సరానికి రూ.1.8 లక్షలు జీతం వస్తుందని, వివరాలకు 9493210966 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పుంగనూరు : మండలంలోని పూజగానిపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గడదేశి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, మునిరెడ్డి ద్విచక్రవాహనాలపై ఎదురెదుగా వస్తూ ఢీకొన్నారు. క్షతగాత్రులను స్థానికులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముత్యపు పందిరిపై మురిపాల రేడు



సింహ వాహనంపై విహరిస్తున్న కోనేటిరాయస్వామి

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపుపందిరిపై శ్రీస్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, నిత్యకైంకర్యాల అనంతరం భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ఉదయం 9గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తిని యోగ నారసింహ అవతారంలో సర్వాంగ సుందరంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, వేద మంత్రోచ్చారణలు, భక్తులు గోవింద నామస్మరణలు, కళాకారుల కోలాట ప్రదర్శన నడుమ సింహ వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరించారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

మధ్యాహ్నం ఆస్థాన మండపంలో ఉభయదేవేరుల సహా స్వామివారి ఉత్సవమూర్తులను తులసి మాలలతో అలంకరించి పలురకాల సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సతీసమేతంగా ఊయలపై కొలువుదీరగా, వేదమంత్రోచ్చారణలు, అన్నమయ్య సంకీర్తనల ఆలాపన నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఊయలలో సేదతీరుతున్న స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తన్మయత్వం చెందారు.

బకాసురవధ అవతారంలో ..

రాత్రి శ్రీకృష్ణుడిగా బకాసురవధ అలంకరణలో రుక్మిణీ, సత్యభామతో కలిసి ముత్యపు పందిరి వాహనంలో పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. టీడీడీ ఏఈవో గోపినాథ్, డిప్యూటీ ఈవో వరలక్ష్మి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.



ముత్యపుపందిరి వాహనంపై కోనేటిరాయస్వామి



ఊంజల్‌సేవలో స్వామి,అమ్మవార్లు

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

రామకుప్పం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రాయితీ ధరతో అందించే వేరుశనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమృత శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. బస్తా ధర రూ.1,710 చొప్పున విక్రయిస్తామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్‌తో ఈనెల 23వ తేదీ నుంచి స్థానిక రైతు భరోసా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. 1,543 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలోనే విత్తన పంపిణీ

సదుం: మండలంలో రైతులకు వేరుశనగ విత్తన పంపిణీని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. మండలానికి కే6 రకం 900 క్వింటాళ్లు, నారాయణి రకం 105 క్వింటాళ్ల విత్తనాలు ఆర్‌బీకేలకు వచ్చినట్లు చెప్పారు. 380 క్వింటాళ్ల విత్తన కాయలు రావాల్సి ఉందన్నారు. కే6 రకం బస్తా రూ.1710, నారాయణి రూ.1,746 గా నిర్ణయించినట్లు తెలిపారు.

23 నుంచి విత్తనాల పంపిణీ

పెద్దపంజాణి: ఈనెల 23 నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రభీబా తెలిపారు. పెద్దకాప్పల్లి మినహా మిగిలిన అన్ని రైతు భరోసా కేంద్రాలలో 20వ తేదీ నుంచే విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని, నగదు కట్టించుకుని పర్మిట్ ఇస్తామన్నారు. పెద్దకాప్పల్లి ఆర్‌బీకేలో 25వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

21 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చౌడేపల్లె: వేరుశెనగ విత్తనాల కాయల అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జ్యోతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ పోను 30 కేజీల కాయల బస్తాకు రూ.1710 చెల్లించాలని తెలిపారు. కె6, టీసీజీఎస్ 1694 రకం కాయలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తప్పనిసరిగా పంట సాగుకు మాత్రమే వినియోగిస్తామని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

జాతరకు ముస్తాబైన తిరుపతి గంగమ్మ ఆలయం



ఆలయం వద్ద చలువ పందిళ్లు



అమ్మవారి ప్రతిమ విద్యుద్దీపాల కటౌట్

కుప్పం: శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు పట్టణం సిద్ధమైంది. ఆలయ ప్రాగణంతో పాటు పట్టణ ముఖద్వారాల్లో చలవ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 21 ,22 తేదిల్లో జాతర అంగరం వైభవంగా జరుగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం ముత్తమారెమ్మ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పలక, మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పూలు, పండ్లు నివేదించారు.

గంగమ్మకు కలశాభిషేకం

పలమనేరు: పట్టణంలో జరగనున్న గంగమ్మ జాతర సందర్భంగా నిత్య పూజల్లో భాగంగా పట్టణానికి చెందిన గాండ్ల కులస్తులు శనివారం అమ్మవారికి కలశాభిషేకాన్ని నిర్వహించారు. 108 కలశాలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక అభిషేక పూజలను చేపట్టారు. తొలుత పాతపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆపై ఇక్కడికి చేరుకున్నారు. అదే విధంగా నియోజకవర్గానికి చెందిన కురుబ కులస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



ఆలయానికి వస్తున్న గాండ్ల కులస్తులు

కొండెక్కిన కోడి ధర

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.240 నుంచి రూ.260
- దుకాణదారులు రూ.160 కొని అధిక ధరకు విక్రయం



గుడిపాల: కోడి కూరలకు రెక్కలు వచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. నిన్నటి వరకు రూ.160 పలికిన చికెన్ అమాంతం రూ.240 నుంచి రూ.260 కి చేరింది. దాణాతో పాటు కోళ్ల ఫీడింగ్‌కు అందించే మందులు, రవాణా చార్జీల భారాన్ని వ్యాపారులు కొనుగోలుదారులపై వేస్తున్నారు. ఫామ్‌లలో పెంపకానికి తెచ్చే కోడి పిల్లల ధరలు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పెంపకం దారులంటున్నారు. ఆరు నెలల క్రితం రూ.20కి లభించే పిల్లలు నేడు రూ.45కి కొనాల్సి వస్తుందని చెబుతున్నారు.

3,500కు పైగా కేంద్రాలు

జిల్లాలో సుమారు 150 కోళ్ల పెంపకం కేంద్రాలున్నాయి. సుమారు 3,500కి పైగా చికెన్ సెంటర్‌లున్నాయి. జిల్లా కేంద్రంలోనే 300కు పైగా విక్రయ కేంద్రాలున్నాయి. రోజువారీ జిల్లా వ్యాప్తంగా 30 టన్నులకు పైగా కోళ్లు అమ్ముడవుతున్నాయి. ఆదివారం, పండుగ రోజుల్లో 35 నుంచి 45 టన్నులు చికెన్ విక్రయాలు జరుగుతున్నాయి. కిలో కోడిని రూ.150కి కొన్న వ్యాపారి రీటైలర్స్‌కి రూ.12 లాభంతో కలిపి రూ.162కి విక్రయిస్తున్నారు. రీటైలర్స్ కిలో కోడిని క్లీన్‌చేసి రూ.240 నుంచి రూ.260 వరకు విక్రయిస్తున్నారు. కిలో చికెన్‌పై 80 నుంచి రూ.90 వరకు అదనంగా చేర్చి అమ్ముతున్నారు. దుకాణాల అద్దెలు, గ్యాస్, క్లీనింగ్, కూలీల ఖర్చు, అద్దెపోను తమకు రూ. 20 నుంచి రూ.30 వరకు మిగులుతోందని విక్రేతలంటున్నారు.

పెరిగిన ధరలు

సాధారణంగా వేసవికాలంలో చికెన్ ధర తగ్గుతుంది. ఈ సారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. రెండు కిలోల బరువు పెరగడానికి కోడిని పెంపకం దారుడు 45రోజుల పాటు సంరక్షించుకోవాలి. వేసవిలో మేత సరిగ్గా తినవు. దీంతో బరుగు పెరగడానికి 60 రోజుల సమయం పడుతుంది. బ్రాయిలర్ కోడి మేతలో ప్రధానమైన సోయాబీన్ ధర నెలరోజుల వ్యవధిలో కిలోకు ఏకంగా రూ.30 నుంచి రూ.70కి పెరిగింది. మొక్కజొన్న కిలో రూ.14 నుంచి రూ.23 కి పెరిగింది. ఈ క్రమంలో బ్రాయిలర్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

నేటి నుంచి కల్లూరు జాతర

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో ఆదివారం నుంచి మూడు రోజులపాటు గంగజాతర ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక మహిషాసురమర్దిని అలంకరణ, అభిషేకం, ఊంజల్ సేవ, 20న గాయత్రీ అలంకరణ, కలశపూజ, అగ్నిగుండం, 21న అమ్మవారి గ్రామోత్సవం జరుగు తుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మండల సమావేశం రేపు

పుంగనూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సాధారణ సమావేశాన్ని ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు సమావేశంలో అత్యవసర కార్యక్రమాలపై మాత్రమే సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

డయల్ యువర్ డీఎం రేపు

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈనెల 20న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం టీకే స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు సమస్యలు, సలహాలు, ఫిర్యాదులను 9959225678 నంబరుకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె: గ్రామీణ పేదల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భవతులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి



పెద్దపంజాణి: విశేష అలంకరణలో అమ్మవారు







రామకుప్పం: ప్రత్యేక అలంకరణ, పలమనేరు: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, పూజల్లో పాల్గొన్న భక్తులు



పుంగనూరు: కన్యకాపరమేశ్వరిదేవి

పలమనేరు: పట్టణంలోని గంగమ్మ గుడివీధిలో వెలిసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి జయంతి వేడుకలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభి షేకం, లక్షకుంకుమార్చన, లలితాహోమం, పూ ర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పట్టణంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. శోభయాత్రలో భాగంగా నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆర్యవైశ్య మండలి, వాసవీ సేవాకమిటీ, ఉత్సవ కమిటీ, వాసవీ మహిళా మండలి, భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి పుష్ప పల్లకిపై అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో శనివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం జయింతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాగణపతి పూజ, కలశస్థాపన, రక్షాబంధనం, కలశారాధన, శ్రీవాసవీ హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి నిర్వహించారు. అమ్మవారి పట్టుచీరను గ్రామానికి చెందిన మొగిలి రెడ్డెప్ప రూ.7,700లకు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలకేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరిమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశిష్ట అలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని శ్రీవాసవీ మాత ఆలయంలో జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, గంగపూజ, కలశపూజ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. మహామంగళహారతి చేపట్టారు. హోమ పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సమూర్తిని ఊరేగించారు. సంఘం అధ్యక్షుడు ధవనంభక్త, సభ్యులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలకేంద్రంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు వైభవంగా జరుపుకొన్నారు. మహిళలు పాల కలిశాలతో ఊరేగింపుగా వచ్చి అభిషేకాలు చేశారు. ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తికి బెల్లం, రూపాయి నాణేలతో తులాభారం నిర్వహించారు.



బైరెడ్డిపల్లె: హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు



వి.కోట: పాల కలశాలతో ఊరేగింపు



చౌడేపల్లె: హోమ పూజలు

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల సమయంలో తేలికపాటి చినుకులతో ప్రారంభమై, ఆపై జోరుగా పడింది. దీంతో రోడ్లంతా జలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మాట్లాడుతున్న డైరెక్టర్ గ్లోరీ విజయ్‌కుమార్

పూతలపట్టు: ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలని శుచి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్ కుమార్ అన్నారు. మండలంలో వెంకటాపురం దళితవాడ, ఎగువ పాలకూర దళితవాడ, దిగువ పాలకూర కిచ్చన్నగారి పల్లె, మద్దులయ్య గారిపల్లె, అమ్మేపల్లె, ఆకనంబట్టు, క్షీరసాగరం గ్రామాల్లో సుమారు 500 మంది కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి రెండు కొబ్బరి మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. శుచి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, చేతి వృత్తి నైపుణ్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు అనేక కార్యక్రమాలు సేవలందించమన్నారు. సుమారు 500 కుటుంబాలకు 1000 మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శుచి సంస్థ కో–ఆర్డినేటర్లు ధనలక్ష్మి, జాకబ్, వరదరాజులు చిన్నయ్య, సర్పంచ్ రామతులసీ పాల్గొన్నారు.